

# అమ్మాజీ జాతకం

కాళ్ళ వేళ్ళమధ్య ఒరిస్తే సైబాల్ రాసుకుంటా ''మా పెళ్ళయ్యి పదిహేనేళ్ళు దాటినా నా కడుపునింత కాయ కాలేదండి'' అంది అమ్మాజీ.

నవ్వేసేడు ఆ కాంద్రకోట సిద్దాంతిగారు.

''అలా నవ్వుతారేంటండీ?'' అడిగింది అమ్మాజీ.

ఇల్లంతా తిరిగి అవతల వీధిదాకా ఉన్న ఇంటెనక దొడ్డికూడా జూసిన సిద్దాంతి ''ముందు ఈ పాతింట్లో కాపురం మానేసి దొడ్డివేపు

ముఖద్వారం పెట్టి కొత్త ఇల్లు కట్టుకుని అందులో కాపురం చెయ్యండి... మీకు పిల్లలు పుట్టకపోతే నన్ను అడగండి'' అనేసి మంచి తనే పెట్టేసి ''వాస్తుకి తగ్గట్టు నేను ప్లాను గీస్తే నా మేస్త్రులే వచ్చి కట్టాలి మరి పర్లేదా?'' అన్నాడు.

''పర్లేదా అంటారేంటి... భళేవోరే'' అన్నాడు అమ్మాజీ భర్త రామిరెడ్డి.

''మేస్త్రులంతా పెద్దాపురంనించి వస్తారు వాళ్ళకి కూలితో పాటు భోజనాలు కూడా పెట్టాలి ఇల్లుకట్టే స్థలంలోనే మూల పాకేసుకుంటారు సరేనా?'' అన్నాడు.

''మీరింకేం మాటాడకుండా ఉన్న పళాన ఆళ్ళని పంపించండి'' అని ఘనంగా తాంబూలం ఇచ్చి బస్సుదాకా సాగనంపేరు ఆ సిద్ధాంతిగార్ని.

అనుకున్న మంచిరోజు కంటే ఒక పూట ముందే దిగిపోయేరు పెద్దాపురం మేస్త్రులు. మర్నాడు పొద్దుట ముహూర్తం టైముకి బ్రేమ్మల సుబ్బారావుగారితో పూజలు చేయించి పునాది రాయేసి ఇక తవ్వడం మొదలెట్టేరు.

పన్లు చకచకా సాగిపోతున్నాయి. పునాదులూ ఆ తర్వాత టేకుగుమ్మాలూ, కిటికీలూ పెట్టి గోడలు లేపేపన్లు చకచకా అయిపోతున్నాయి. ఆ ఇల్లు కట్టే పనిలో రామిరెడ్డికంటే ఎక్కువ కష్టం అమ్మాజీ పడుతుంది. అన్నీ దగ్గరుండి చూసుకుంటుంది.

అయితే ''నుయ్యి వాయువ్యంలో తవ్విద్దారి పెడపర్తిలో ఎవరో చెప్పేరు మొన్న'' అంది అమ్మాజీ.

''తూర్పున తవ్విస్తే చాలా మంచిదండి'' అన్నాడు పెద్దాపురం తాపీ మేస్త్రి మూలాస్వామి.

అంతలో వచ్చిన భర్త రామిరెడ్డి ''మన మేస్త్రి చెప్పినట్టు తూర్పు పక్కే కరక్టు'' అన్నాడు.

మాటామాటా పెరిగింది వాదన కింద మారింది. చివరికి ఎన్నోఇళ్ళు కట్టిన మేస్త్రి మూలాస్వామి శాస్త్రమంతా చదువుతా రామిరెడ్డికి సపోర్టు చెయ్యడంతో వాళ్ళ మాటే నెగ్గింది.

వాళ్ళలా మాటాడ్తుంటే తట్టుకోలేక పేణంలో కుతకుతా ఉడికే బెల్లంలాగయిపోయిన అమ్మాజీ ''ఎలాగోలా చావండి'' అనేసెళ్ళిపోయింది.


నుయ్యి తూర్పునే తవ్వేరు చివరికి.

తన మాట లెగ్గలేదన్న దాంతో ఇల్లు కట్టుబడి దగ్గరకి అమ్మాజీ వస్తుందిగానీ పూర్వమంత శ్రద్ధలేదు. ఏదో పనోళ్ళందరికీ వండింది పెట్టేసి వెళ్తుంది. వెళ్తా వెళ్తా మేస్త్రి అప్పలస్వామి కేసి విసురుగా చూస్తుంది.

''వంటగది ఉత్తర ముఖంగా కడదాం మారేడుబాకలో ఒకరు చెప్పేరు'' అంది అమ్మాజీ.

''తూరుపు ముఖం మంచిదండి'' అన్నాడు మూలాస్వామి. అప్పుడే వచ్చిన రామిరెడ్డి ''మన సిద్ధాంతి గారు కూడా తూర్పు అన్నట్టు గుర్తే'' అన్నాడు.

చాలా కోపమొచ్చేసింది అమ్మాజీకి.



ఇంట్లో వంటా పెంటా చేసేది నేను. ఇంట్లో ఎక్కువుండేది నేను. నామాటే నెగ్గాలి అంటా వాదించడం మొదలెట్టింది అమ్మాజీ.

మర్నాడు బస్సు దిగిన కాండ్రకోట సిద్దాంతిగారు ''తూర్పు ముఖంగా వంట ఎడతెగని పంట'' అన్నాడు.

ఉక్రోషంతో రెచ్చిపోయిన అమ్మాజీ ''ఎలాగోలాగ చావండి. పిల్లలు గావాలంటే రాంపురం వెళ్ళి ఈలివాడపిల్లిగారి హాస్టల్లో పిల్లల్ని తెచ్చుకు పెంచుకుంటానుగానీ ఈ కొత్తింట్లో మట్టుకి చస్తే అడుగెట్ట''ననేసి పాతింటి కొచ్చేసింది.

చాలా బతిమాలి జూసేడు రామిరెడ్డి. రానుగాక రానంది. తర్వాత కాండ్రకోట సిద్దాంతీ చివరికి మేస్త్రి మూలాస్వామి చెప్పి జూసేరు. చచ్చినా రాననేసింది. ''ఆ మనిషే రాక పోతే అసలు గృహప్రవేశం ఎవరు చేస్తారు''అంటా అందరికీ కూలీలిచ్చి పంపేసి ఆ ఇంటి నలాగే వదిలేసి పాతింట్లో కొచ్చేసేడు రామిరెడ్డి.

* * *

చాగల్నాట్లో బాలవరం అవతల దొంతమూర్లో ఒక ఏభై ఎకరం ఉంది రామిరెడ్డికి. వేసంగుల్లో దూళ్ళని మేతకోసం అక్కడికి తోలేస్తుంటాడు. పనున్నా లేకపోయినా ప్రతినెలా మొదటి వారమంతా దొంతమూరులో ఉండి వస్తుంటాడు.

నెలనెలా అన్నేసి రోజులెందుకని అమ్మాజీ అడిగితే జీడిమామిడి విత్తనాలు కొనాలనీ దుక్కు దున్నిస్తున్నాననీ, జలగడ్డికి గింజలు జల్లించేనని, చెరువు ఎండిపోతే మెరక తీయిస్తున్నాననీ ఇలాగేదో చెప్తున్నాడు.

ఆవేళ ఉద్దారకుడి ద్వారా బయటపడింది ఒక కథ. అదేంటంటే ——

ఆ దొంతమూరులో పాప అని ఒక మనిషి ఉందట రామిరెడ్డికి. ఇద్దరు పిల్లలూకూడానంట ఆపాపకి.

సవ్వారీ బండి కట్టించుకుని పొలంలో ఉన్న రామిరెడ్డి దగ్గరకెళ్ళి పోయిన అమ్మాజీ ''ఇది నిజవా?'' అనేసి నిలదీసింది. అమ్మాజీ రంకెలకి కలుపు తీస్తున్న ఆడోళ్ళంతా పని మానేసి చూస్తున్నారు. పక్కనే ఉన్న నరాలపాలెంలో జనవంతా వచ్చేసేరు. ''ఇది నిజవా..నేవిన్న ముక్క నిజవేనా?'' అనేసి పిచ్చెక్కిపోయినట్టు అరుస్తుంటే వాళ్ళ ముందు తలెత్తుకోలేని దశ కొచ్చేసిన రామిరెడ్డి ''నిజమే అయితే ఏంటట?'' అనేసేడు.

అంతే,

పూనకం వచ్చేసినట్టు ఊగిపోతా ఇంటికొచ్చేసిన అమ్మాజీ ''ఈ జన్మకి నీ ముఖం చూడనుగాక చూడ్ను'' అని శపథం చేసి తన వస్తువులన్నీ సర్దేసుకుని ట్రంకుపెట్టెలు సవ్వారీ బండిలోకి ఎక్కించేసుకుని పుట్టినూరయిన పాలమూరెళ్ళిపోయింది.

ఆ తర్వాత పాలమూరు వచ్చిన రామిరెడ్డి రమ్మని చాలా బతిమాలేడు. రాలేదు. చేగల్నాడులో ఉన్న ఆ పాపనీ చిన్న పిల్లల్నీ తీసుకొచ్చేడు. అమ్మాజీ కాళ్ళట్టుకుని తప్పయి పోయిందని ఏడ్చింది పాప. చంటిపిల్లల్తో దణ్ణమెట్టించింది.

ఏమాత్రం కరగని అమ్మాజీ ''ఉన్న పళానెళ్ళిపోండి'' అనేసి ఒకటే కేకలు.

''ఇంటి మగోడు బయటేవో పెత్తనాలు జేస్తుంటాడు ఆడోళ్ళం మనం సర్దుకుపోవాలి గానీ ఇలా అల్లరి చెయ్యగూడదు'' అన్న వదినగార్ని చీపురుకట్ట తీసుకుని వీపునిండా దద్దుర్లొచ్చేలాగ బాదేసరికి గుడిపక్క ఆచార్లుగారింట్లో దాక్కుందా వదినిగారు.

అమ్మాజీ చెల్లెలు బులిమంగయమ్మది అనపర్తి. అక్కడి కెళ్ళిపోయిన అమ్మాజీ వాళ్ళింట్లోనే ఉండడం మొదలెట్టింది.

ఒకరోజు తొస్సిపూడినించి సంపర్త పిలుపుల కొచ్చిన బంధువులు ఇంట్లో ఉన్న అమ్మాజీని చూసి ''ఈ మనిషెవరు?'' అన్నారు.

''మంగయమ్మ అక్కగారట పసలపూడి ఆళ్ళది'' సమాధానం చెప్పింది పక్కింటి మనిషి.

''మరి ఆళ్ళూళ్ళో ఉండక ఇక్కడేంటి?'' అడిగేరు బంధువులు.

''గొడ్డుమోతు మనిషి , పంతాలకి పట్టుదలకి ఎక్కువ పోద్ది, ఏదోచిన్న గొడవ వచ్చి మొగుడ్నొదిలేసింది. ఆ పెనిమిటి రామిరెడ్డి చాలా నిమ్మళం అయినా మగోడి కిందుండే ఆడదానికి అంత పట్టుదల పనికి రాదు?'' అందా పక్కింటి మనిషి.

ఆ మాటలు విన్న అమ్మాజీ అమాంతంగా లేచి బూజు దులిపే కర్రతో ఆ పక్కింటి మనిషి మీదికి దూకే సరికి ఒణికి పోయి పారిపోయేరంతా వెంటనే బట్టలవీ సర్దేసుకుని అక్కగారు సుబ్బయ్యమ్మ ఉండే బలభద్రపురం మకాం మార్చింది అమ్మాజీ.

అక్కడికొచ్చిన చెల్లెలు బులి మంగయమ్మ ఆవిడభర్త పద్దయ్యారెడ్డీ ఎంత బతిమ లాడినా వెనక్కి రానంది. ''నేను మాటంటే మాటే'' అంది. ''పట్టంటే పట్టే'' అంది.

ఆ బలభద్రపురంలోనే ఉండిపోయిన అమ్మాజీ అక్కగారయిన సుబ్బయ్యమ్మ ఇద్దరు కొడుకుల్లో చిన్నోడు బాబుల్ని దత్తత తీసుకుని అత్తారబతంగా పెంచుకోడం మొదలెట్టింది.

బిక్కవోలు స్కూల్లో చదువుకుంటూ పెద్దదిగిన బాబులికి తన ఆస్తి మొత్తం రాసేసి పందలపాక సంబంధం చేసింది.

వచ్చిన కోడలు పేరు రాజ్యం. తండ్రిది రాజమండ్రిలో సోవాలమ్మగుడి దగ్గర దూళ్ళ వ్యాపారమంట. అక్కడ చదూకోడం వల్ల భాషలో యాసలేదు.

* * *

ఒకరోజు కొడుకు కోడలు తనూ చిన్న కారు కట్టించుకుని గోకవరం అవతల తండికొండ వెంకన్నబాబు గుడికెళ్ళేరు.

బాబులేమో గుండు గీయించుకోడానికెళ్తే, సీమసింత చెట్టుకింద నిలబడున్న ఒక కుర్రోడితో తెగ మాటాడ్తుంది కోడలు రాజ్యం.

అది చూసిన అమ్మాజీ ''బుల్లీ ఇలాగొలే'' అని పిల్చింది.

రాకుండా. ఇంకా మాటాడతానే ఉంది రాజ్యం.

ఆ కుర్రాడెళ్ళేకా దగ్గర కొచ్చిన అమ్మాజీ ''ఎవడాడు?'' అంది.

''మా దూరపుబంధువు వాళ్ళ ఇల్లు మామిడాడ పాటిమీద'' అంది.

''పాటిమీదో కాటి మీదో ఎక్కడైతే నాకేంటిగానీ అంతంతసేపు ఏంటాడితో ఆ మాటలు ఆ...?'' అంది అమ్మాజీ.

''ఆడూ ఈడూ అనకండి..అతను చాలా మంచి వాడు కాకినాడలో ఉజ్జోగం''.

''ఆడి ఉజ్జోగం కాకినాట్లో అయితే నా కేంటి చాగల్నాట్లో అయితే నాకేంటి? ..పెళ్ళయిన ఆడదానివి అసలాడితో అలాగ పేట్రేగిపోడం ఏంటి?''.

''బంధువులమనిషితో మాటాడ్డం తప్పా?''

''ఆ ఎదురు ప్రశ్నలేంటే అసలా పరాయి మగోడితో అంతంతసేపు ఆ మాటలేంటే ... ఆ నవ్వులేంటే. చెప్పు నాకసలే ఓర్పుం తక్కువ చెపుతావా లేదా?''.

''ఏంటత్తయ్యా ఇది..ఏం మాటాడుతున్నారు మీరు?''.

ఈలోగా గుండు గీయించుకుని వచ్చిన బాబులు ''ఏవయ్యింది?'' అన్నాడు.

విసుర్లు నోటి సుతలో ఉంటాయేమో చాలా మాటలు వదిలేసింది అమ్మాజీ. రాజ్యంకూడా ఉండబట్టలేక కొన్ని మాటలని ఆవేశంలో ఇంగ్లీషులోకి దిగిపోయింది. అర్థంగాక అవేవో తిట్లని అప్పార్థం చేసుకున్న అమ్మాజీ, రాజ్యం మోచేతిదగ్గరా, జబ్బలదగ్గరా గాట్లు పడి రక్తాలు కారేలాగ కొరికేసింది.

ఉండబట్టలేకపోయిన బాబులు పెళ్ళాన్ని వెనకేసుకొచ్చి తల్లిని మందలించేడు. దాంతో అరుపులన్ని ఒక్కసారి ఆపేసిన అమ్మాజీ ఉన్న పళాన బలభద్రపురం బయల్దేరి పోయి ట్రంకుపెట్లో తన నగలూ దాచుకున్న డబ్బులూ, బట్టలూ కుక్కేసుకుని బస్సులో సామర్లకోటెళ్ళి స్టేషనులో ఆగున్న ఈస్టుకోస్టు బండెక్కేసింది.

* * *

మొత్తానికెలాగో కాశీచేరిన అమ్మాజీ అక్కడ కొన్నాళ్ళుంది. ఒకరోజు దేవుడి గుళ్ళో తనకి ఎదురుచెప్పిన పండాతో మాటా మాటా రావడంతో ఆడ్ని తెగతిట్టేసి పక్కనే ఉన్న ఇంకో సాధువుకి తన చేతిలో ఉన్న ట్రంకుపెట్టి మొత్తం దానం చేసేసి ''మీ కాశీకంటే మా ద్రాక్షారం భీమేశ్వరుడి గుడేనయ్యిం'' అని దేవుడ్ని కూడా తిట్టేసి బయల్దేరి పోయింది.

* * *

ఇది మాటాడాలి ఇది మాటాడకూడదు అన్న ఇంగితం లేకండా నోటికేవొస్తే అది అనేయడం, పట్టిన మంకు పట్టుతోనే ముందుకెళ్ళడం ఎదుటోళ్ళని ఇట్టే ఇంకోలాగ అర్థం చేసుకోడం వల్ల ఎవరెవరితోనో ఏవేవో గొడవలు పడతా వూళ్ళు మారుతా తిరుగుతుంది అమ్మాజీ.

ఏళ్ళు పూళ్ళు గడుస్తున్నాయి. కాలం కరుగుతా వస్తుంది.

* * *

శివరాత్రి ముందు రోజు. ద్రాక్షారామం భీమేశ్వరుడి గుడి నాలుగు ప్రాకారాల ముందూ పందెళ్ళు వేసే సందట్లో ఉన్నారు జనం. కాలభైరవస్వామి ఆలయం ముందూ, సోమవార మంటపం దగ్గరా మామిడాకుల తోరణాలు కడ్తున్నారు..చిత్రగుప్త సభ దగ్గర కూడా జనం తిరుగుతున్నారు.

గుడికి దూరంగా రావిచెట్టు దగ్గర పాడైపోయిన ఒక మంటపం కింద స్నేహితుల్తో పాటు కూర్చున్న గిరిబాబు పేకాడ్తున్నాడు.

గిరిబాబు సొంతూరు ఆర్యవటం. ద్రాక్షారామం భీమేశ్వరా టాకీసులో టిక్కెట్ల గుమస్తా పని చేస్తున్నాడు. పేకాటపిచ్చి కాస్త ఉన్న గిరిబాబుకి ఎప్పుడూలేంది ఆ వేళ ఆటలో మొత్తం తుడిచి పెట్టుకుపోయింది. రాత్రికి తిండెలాగరా దేవుడా అనుకుంటుంటే ఆటలో డబ్బులు బాగా వచ్చిన జతగాడు గంగారావు ''జీతం రోజున తిరిగిద్దూగాన్లే'' అనేసి అదోలాగ నవ్వుతా, పక్కోడికి కన్నుగొడతా అయిదురూపాయలు అప్పిచ్చేడు.

ఆనోటు జేబులో పెట్టుకుని లేచి నడుచుకుంటా వస్తున్న గిరిబాబు ఆలయం తూర్పు గోపురం ముందున్న రావిచెట్టు దాటుకుంటా వస్తుంటే ఒక ఆడమనిషి ఏడుపు వినిపించి అటుపక్కకి తిరిగి చూసేడు. ''బాబూ తిండి తిని మూడు రోజులైందండి... నోట్లోకి ఏదోటి ఎళ్ళక ప్రాణాలు పోయేలాగున్నాయి నాయినా'' అని ఏడుస్తున్న అమ్మాజీ పోల్చుకోడానికి క్కూడా వీల్లేకుండా ఉంది. సన్నగా ఒంగిపోయి బులుగుపోయిన వెదురుగెడలాగుంది. మొత్తం పండిపోయిన జుట్టు మూడొంతులు రాలిపోయి చెల్లాచెదురయిపోయుంది. కనుగుడ్లు

లోపలెక్కడికో పోయున్నాయి. ఇంకాస్సేపట్లో ప్రాణాలు పోయేలాగున్న అమ్మాజీ తనకేసి అలాగ చూస్తా అడుగుతుంటే అదోలాగయిపోయింది గిరిబాబు మనసు. తనకి తెలియకుండానే తన కళ్ళల్లోంచి వచ్చిన కన్నీళ్ళు చాతిమీదకి కారినియ్యి. జేబులో ఉన్న అయిదు రూపాయిల నోటు ఆవిడి గుప్పెట్లో పెట్టి రిజిస్ట్రాఫీసు అవతలున్న తన గదిలోకెళ్ళి కుండలో నీళ్ళు తాగి పడుకున్నాడు

* * *

తెల్లారింది.

శివరాత్రి.

ఊర్నిండా ఒకటే జనం.

ఎక్కడెక్కడ్నుంచో వచ్చిన జనాల్తో నిండిపోయుంది ద్రాక్షారామం.

సప్తగోదావరిలో స్నానాలు చేసి నీళ్ళోడుతున్న బట్టల్తో గుళ్ళో కెళ్ళడానికి ఒకటే తోసు కోడాలు. కొబ్బరికాయల కొట్లవాళ్ళు, హారతి కర్పూరం అమ్మే పిల్లల్తో ఒకటే గోల అడుగుతీసి అడుగెయ్యడానికి చాలాసేపు పట్టేస్తుంది. దర్శనం కోసం గుళ్ళోకెళ్ళబోతున్న కొందరు భక్తులు మహాద్వారానికి దూరంగా చూస్తా ఆగిపోయేరు. ఆ భక్తుల్లో రామిరెడ్డికూడా వున్నాడు.

కుళ్ళు కాలవలో ఉన్న శవాన్ని తీస్తున్నారు జనం.

అటుగా వెళ్తా చూసిన గిరిబాబు ''రాత్రి ఆకలితో ఏడ్చిన ముసలావిడ శవం గదా ఇది?'' అనుకుంటా దగ్గరకెళ్ళేడు.

బిగుసుకుపోయిన అమ్మాజీ గుప్పెట్లో నలిగిన ఆ నోటు అలాగే ఉంది.

అది తన భార్యశవం అని తెలీని రామిరెడ్డి గట్టిగా కళ్ళు మూసుకుని ''శివరాత్రి పర్వ దినాన గుళ్ళో కెళ్ళొచ్చి దిక్కుమాలిన శవాన్ని చూడ్డం మహాపాపం శివ..శివా'' అనుకుంటా అమ్మాజీ శవం పక్కనించే వెళ్ళిపోయేడు.

* * *

మధ్యాన్నం ఆట సావిత్రీ నాగేశ్వర్రావుల సినేమా చదువుకున్న అమ్మాయిలు. లోపలికెళ్ళి మేనేజరు దగ్గర టిక్కెట్లు తీసుకుని కౌంటరు దగ్గర కొస్తుంటే ఎదురైన గంగారావు ''ఏరా గిరిబాబూ... రాత్రి ఏవన్నా తిన్నావా?'' అనడిగేడు.

''లేదు'' అన్నాడు గిరిబాబు.

''హొటల్లో నోటు మార్చేవా?'' అడిగేడు గంగారావు.

''లేదు అసలు ఒటేలుకే వెళ్ళలేదు'' అన్నాడు గిరిబాబు.

''ఇంకానయం... హొటలు కెళ్ళేవుగాదు... రాత్రి సరదాకిచ్చిన ఆనోటు దొంగనోటు'' అన్నాడు గంగారావు.

* * *